
ప్రజాశక్తి
శనివారం 27 జులై 2024 5 విజయనగరం



ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆగస్టు 1 తేదీ ఉదయం 10 గంటలకల్లా పింఛన్ల పంపిణీ పూర్తి చేయడానికి కృషి చేయాలని వెల్ఫేర్ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం ఎం నాయుడు ఆదేశించారు. శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పింఛన్ల పంపిణీ విధివిధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతాంశం ప్రకారం ప్రతి నెల ఒకటో తేదీన శతశాతం పింఛను పంపిణీ జరగాలని అన్నారు. నిర్దేశించబడిందన్నారు. దీని ప్రకారం గత నెల నగరపాలక సంస్థ పరిధిలో 99.3శాతం పింఛను పంపిణీ జరిగిందన్నారు. మొత్తం 23,305 పింఛందారులు ఉన్నారని వారిలో 110 మంది మరణించగా మరో 117 మంది అందుబాటులో లేకపోవడంతో 99.3శాతం పింఛను అందజేశామన్నారు. ఈ దఫా శతశాతం పూర్తి కావాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, టిపిఆర్ఒ సింహాచలం పాల్గొన్నారు.

తుపాను సమయంలో సముద్రం ఆటుపోట్లకు గురవుతూ అల్లకల్లోలంగా మారుతుంది. ఆ సమయంలో నల్లని ఇసుక రేణువుల్ని తెచ్చి ఒడ్డున పడేస్తుంది. ఇసుకే కదా.. రంగు మారిందని పొరపాటు పడుతున్నాం. ప్రకృతి ప్రసాదిస్తున్న అతివిలువైన ఖనిజ సంపదని గుర్తించలేక పోతున్నాం. దాని విలువ రూ.లక్షల్లో ఉంటుందని ఊహించలేకపోతున్నాం. శ్రీకాకుళం, విజయనగరం తీరంలో కొన్ని చోట్ల మాత్రమే దొరికే ఈ నల్ల బంగారం.. గత కొంత కాలంగా అడ్డదారిలో రాష్ట్రాలు దాటిపోతుందంటే ఆశ్చర్యం కలగక మానదు. అక్రమార్కులు కాపుకాసి రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా కొల్లగొడుతున్నారు. కోట్లాది రూపాయలు విలువైన సంపద అక్రమార్కుల జేబుల్లోకి చేరుతోంది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తీరప్రాంత వాసులు కోరుతున్నారు.



తీరంలో నల్ల ఇసుక

నల్ల ఇసుకను కొల్లగొట్టేస్తున్నారు

- లారీ ఇసుక విలువ రూ.2 లక్షల పైనే
- రాత్రివేళల్లో తరలింపు
- అక్రమార్కుల జేబుల్లోకి 'ప్రకృతి' సంపద
- ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలంటున్న తీరప్రాంత వాసులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

విజయనగరం జిల్లా భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలో సముద్ర తీరాన నల్ల ఇసుక అతి విలువైన ఖనిజ సంపదనే చెప్పాలి. ఎందుకంటే? లారీ ఇసుక విలువ రూ.2 లక్షలుపైమాటే. ఇది వినడానికి నమ్మశక్యం కాకున్నా, ఆ నల్ల ఇసుక నుంచి వచ్చే ఖనిజాల గురించి తెలిస్తే నమ్మితీరాల్సిందేనని ఖనిజ నిపుణులు చెబుతున్నారు. ఇలిమిలైజ్, సిలిమినైట్, రుటైల్, జిర్గాన్, గార్నెట్, మోనలైజ్ వంటి విలువైన ఖనిజాలు అందులో లభ్యమవుతాయి. ఇందులో కొన్ని రకాల రేణువులు అణు విద్యుత్తు, అణుబాంబులకు ఉపయోగిస్తారని చెబుతున్నారు. కంప్యూటర్లలో వినియోగించే సిలికాన్ చిప్‌లు, స్మార్ట్‌ఫోన్ల పరికరాల తయారీకి ఉపయోగిస్తున్నారు. ఇటువంటి ప్రాముఖ్యత ఉన్న నల్లఇసుక విలువను అక్రమార్కులు కనిపెట్టారు.

గుట్టుచప్పుడు కాకుండా..

మొదట్లో లారీల ద్వారా టన్నుల కొద్దీ నల్ల ఇసుకను సంబంధిత కర్మాగారాలకు తరలించుకు పోయేవారు. తరచూ ఇలా తరలిస్తుండటంతో తీరంలో కొంత మందికి అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు నిఘా పెట్టడంతో రాత్రిపూట గుట్టు చప్పుడు కాకుండా తరలించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల ముందు భోగాపురం మండలంలోని అక్రమార్కులపై కేసులు కూడా నమోదు చేశారు. పూసపాటిరేగ మండలంలోని నల్ల ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. తాజాగా పూసపాటిరేగ, భోగాపురం తీరప్రాంత సమీప తోటల్లో నల్ల ఇసుక పోగులు వేస్తున్నారు. రాత్రి పూట తరలించేందుకు సన్నద్ధం చేసుకుంటున్నారు. విలువైన ఖనిజ సంపదను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



తోటల్లో నిల్వ చేసిన నల్ల ఇసుక

తహాశీల్దార్‌కు ఫిర్యాదు

సముద్ర తీర ప్రాంతంలో నల్ల ఇసుక తరలింపుపై శుక్రవారం కొల్లాయివలస మాజీ సర్పంచి దువ్వు అప్పలస్వామి, పి. రామకృష్ణ.. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తులు నల్ల ఇసుక పోగులు వేశారని, వెంటనే వాటిని స్వాధీనం చేసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. విలువైన ఇసుకను కొంత మంది కొల్లగొడుతున్నారని, ఆ సంపదను కాపాడుకోవాలని కోరారు.

మడ్డువలసకు జలకళ

ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

ప్రజాశక్తి-వంగర

మండలంలోని మడ్డువలస ప్రాజెక్టు నాలుగు గేట్లను అధికారులు ఎత్తి, నాగావళి నదిలోకి నీటిని విడిచిపెట్టారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి 3800 క్యూసెక్కుల వరద నీరు మడ్డువలస రిజర్వాయరులో చేరుతోందని ప్రాజెక్టు ఎఇ కె.కుమార్ తెలిపారు. దీంతో నాలుగు ప్రధాన గేట్లు ఎత్తి 5600 క్యూసెక్కుల నీటిని నాగావళి నదిలోకి విడిచి పెడుతున్నట్లు చెప్పారు. కుడి, ఎడమ కాలువల ద్వారా మరో 610 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచి పెడుతున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 65 మీటర్లకు గాను ప్రస్తుతం 64.25 మీటర్లకు చేరిందని చెప్పారు.




మడ్డువలస రిజర్వాయరు నాలుగు గేట్ల ద్వారా విడిచిపెడుతున్న నీరు

గోదాములను వినియోగంలోకి తేవాలి

కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం

రెండు వారాల్లో ఎంపిఎఫ్‌సి గోదాములను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ (డిఎల్ఐసి) సమావేశం శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగింది. వ్యవసాయ మౌలిక వసతుల కల్పన కార్యక్రమంలో భాగంగా, జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఎంపిఎఫ్‌సి (మల్టీ పర్పస్ ఫెసిలిటేటింగ్ సెంటర్స్) గోదాముల పరిస్థితి, పెండింగ్ బిల్లులపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో మొత్తం 44 ఎంపిఎఫ్‌సి గోదాముల నిర్మాణాన్ని చేపట్టగా, వీటిలో ఇప్పటివరకు 23 భవనాల నిర్మాణాన్ని పూర్తి చేశామని, జిల్లా ఇన్‌ఛార్జి సహకార అధికారి ఎస్.రామ్మూర్తి తెలిపారు. ఒక్కొక్క భవనం రూ.40లక్షల వ్యయంతో నిర్మించగా, దీనిలో 90 శాతం నాబార్డు రుణం కాగా, మిగిలిన 10 శాతాన్ని రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. మొత్తం 41 గోదాములను ఒక్కొక్కటి సుమారు 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో, గుషిణి, తమ్మాపురం, వేపాడ-2 గోదాములు మాత్రం 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మాణం జరుగుతోందని తెలిపారు. కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ఇప్పటికే నిర్మాణం పూర్తయిన 23 భవనాలను ప్రజలకు ఉపయోగపడేవిధంగా వెంటనే వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌ను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న భవనాలకు నిర్ణీత గడువు విధించి పూర్తి చేయించాలని సూచించారు. పెండింగ్ బిల్లుల మంజూరుకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. సమావేశంలో వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, నాబార్డు డిడిఎం నాగార్జున, డిసిసిబి సిఇఒ ఉమామహేశ్వరరావు, మార్కెటింగ్ ఎడి బి.రవికిరణ్, పిఎసిఎస్ సిఇఒలు, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ఆత్మలకూ 'ఉపాధి' బిల్లులు

- మస్తర్లు లేకున్నా పేమెంట్లు
- సామాజిక తనిఖీల్లో అక్రమాలు బహిర్గతం

ప్రజాశక్తి-రామభద్రపురం

మృతుల పేరిట ఉపాధి బిల్లులు చెల్లించడం, మస్తర్లు వేయకుండా నిధుల డ్రా చేయడం, వాలంటీర్లకు 3 రోజుల పనికి ఆరు రోజుల వేతనం ఇవ్వడం.. ఇలా ఒకటా రెండా అనేక అక్రమాలకు ఉపాధి హామీ వేదికైంది. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఎన్నో అక్రమాలు బహిర్గతమయ్యాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన పనులపై 22 పంచాయతీల్లో డిఆర్‌పిలు విచారణ చేపట్టారు. డ్వామా ఎపిడిలు శారదాదేవి, జనార్దనరావు, స్టేట్ రిసోర్సు పర్సన్ మన్మథరావు ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ ఆడిట్లో అనేక అక్రమాలు, అవకతవకలు వెలుగు చూశాయి. గొల్లలపేట గ్రామంలో మృతిచెందిన వ్యక్తుల పేరిట పేమెంట్లు ఇచ్చారని ఈ విచారణలో వెల్లడైంది. ఆ గ్రామంలో ఫారంపాండ్ నిర్మించకపోయినా లబ్ధిదారుకు నిధులు చెల్లించారని గుర్తించారు. కోటశిర్లాం, రామభద్రపురం గ్రామాల్లో మస్తర్లు, హాజరు సంతకాలు లేనప్పటికీ వేతనదారులకు పేమెంట్లు చెల్లించినట్టు తేలింది. కోటశిర్లాంలో డూప్లెక్స్ తరహా గృహ నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుకు కూడా ఉపాధి నిధులు చెల్లించినట్టు తేటతెల్లమైంది. రామభద్రపురంలో 5 రోజులు పనిచేసిన వేతనదారుడికి ఆరు రోజుల పేమెంట్ ఇచ్చారని, గతంలో వాలంటీర్లుగా పనిచేసినవారు వారానికి మూడు రోజులే ఉపాధి పనులు చేయాల్సి ఉండగా ఆరు రోజులు చేసినట్టు బిల్లులు తీసుకున్నారని వెల్లడించారు. పాతరేగ గ్రామంలో విచారణకు వచ్చిన సిబ్బందికి ఫీల్డ్ అసిస్టెంట్ రికార్డులు ఇవ్వకపోవడం, డీమస్టర్‌గా ఒక పేపర్‌ను వేతనదారులందరికీ ఇవ్వడం, మస్తర్లు వేయకుండా 45 మంది పనిచేసినా రెండు నెలలైనా బిల్లులు ఇవ్వకపోవడం, 250 జాబుకార్డులు ఉన్నా ఒక్కరికీ కూడా వందరోజులు పని కల్పించక పోవడం వంటివి విచారణలో బయటపడ్డాయి. మిగతా గ్రామాల్లో కూడా చెరువు పనుల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్టు డిఆర్‌పిలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.



ఎపిడితో మాట్లాడుతున్న మిర్తివలస సర్పంచ్ రాంబాబు

బిల్లుల జాప్యంపై నిలదీత

మిర్తివలస గ్రామంలో పైపులైను కల్వర్టు పనులు చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించలేదని గ్రామపంచాయతీ సర్పంచ్ మజ్జి రాంబాబు అధికారులను నిలదీశారు. ఉపాధి ఉద్యోగులు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. రొంపల్లి గ్రామంలో చేసిన ఉపాధి పనులకు నిధులు చెల్లించడం లేదని ఎంపిటిసి భవిరెడ్డి శంకరరావు అధికారుల తీరును తప్పుబట్టారు. నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంపై తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారుల దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ చుక్క ఈశ్వరమ్మ, ఎపిఒ జి.త్రినాథరావు, ఇసి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గోడౌన్లు లేవట!

- రైతుకేంద్రాల్లో ఎరువులు లేకపోవడంపై కుంటిసాకులు
- సమస్యపై పట్టించుకోని పాలకులు
- వైసిపిలో లేని సమస్య కూటమి ప్రభుత్వంలో ఎందుకో?

దత్తిరాజేరు మండలం పాచలవలసలో గత ఏడాది రైతు సేవా కేంద్రానికి సొంత భవనం లేదు. కానీ, స్థానిక విలేజ్ క్లీనిక్ భవనంలోని చిన్నపాటి గదిలో ఎరువులు నిల్వచేసి అందుబాటులో ఉంచారు. అదే గ్రామంలో ప్రస్తుతం రైతు సేవా కేంద్రానికి సొంత భవనం అందుబాటులోకి వచ్చింది. కానీ, సచివాలయ సిబ్బంది కూడా అదే భవనంలో ఉండడం వల్ల ఎరువుల నిల్వకు అవకాశం లేకుండా పోయింది. ఎప్పటి మాదిరిగా విలేజ్ క్లినిక్ లేదా గ్రామంలోని ఓదో ఒక ఇంటిలోనైనా నిల్వచేస్తే రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేది. గోడౌన్ లేదనే సాకుతో ఈ ఏడాది ఏకంగా ఇండెంట్ పంపకపోయినా అధికారులుగానీ, పాలకులుగానీ పట్టించుకోలేదు. దీంతో, ఈ ఏడాది ఆ గ్రామంలో ఎరువులు అందుబాటులో లేవు. దీంతో, రైతులు ప్రైవేటు దుకాణదారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ప్రైవేటు వ్యాపారులు ప్రతి బస్తాపైనా రూ.100కు తగ్గకుండా ధర పెంచి విక్రయిస్తున్నారు. దీనికి తోడు రవాణా ఛార్జీలు కూడా భారంగా మారాయి. మెంటాడ మండలంలోని పిట్టాడ, ఆంద్ర, కొండలింగాలవలసలో గోడౌన్లు ఉన్నా ఎరువుల కోసం ప్రతిపాదనలు పంపలేదు. ఈ గ్రామాల్లోనే కాదు.. జిల్లా వ్యాప్తంగా 214 రైతు సేవా కేంద్రాల పరిధిలో వేలాది మంది రైతులు ఎదుర్కొంటున్న సమస్య. జిల్లాలో ఎరువుల సమస్యపై పాలకులు పట్టించుకోకపోవడమే ఇందుకు కారణం.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి




రైతు సేవా కేంద్రం

అధికారిక లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్ మొత్తానికి 51476 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. ఇందులో ఈనెల ఆఖరినాటికి 15,829 మెట్రిక్ టన్నుల మేర అందుబాటులో ఉండాల్సివుండగా లక్ష్యానికి మించి ఎరువుల నిల్వలు ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. కానీ, జిల్లా వ్యాప్తంగా 510 రైతు సేవా కేంద్రాలు ఉండగా, గోడౌన్లు లేవనే సాకుతో చాలా చోట్ల 214 రైతు సేవా కేంద్రాల నుంచి ప్రతిపాదనలు పంపలేదు. వాస్తవంగా ఈ కేంద్రాలు సొంత భవనాల్లో లేవుకాబట్టి గోడౌన్లు లేకపోవచ్చు. కానీ, గత ప్రభుత్వం హయాంలో గ్రామంలోని ఇతర శాఖలకు చెందిన ప్రభుత్వ భవనాలు, లేదా అప్పటి పాలకుల పరపతితో ఇళ్లల్లోనూ నిల్వలు ఉంచారు. ఇది కూడా అప్పట్లో అధికారులు చెప్పినమాటే. దీంతో, రైతు సేవా కేంద్రాల ద్వారా 30శాతం ఎరువుల పంపిణీ జరిగేది. దీంతో, చిన్నసన్నకారు రైతులకు ఇబ్బంది ఉండేది కాదు. సర్పంచులు, ఎంపిటిసి, జెడ్‌పిటిసి సభ్యులు మొదలుకుని ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు వరకు ఒకే పార్టీలో ఉండడంతో అప్పట్లో ఈ సమస్యను సులువుగా ఎమ్మెల్యేలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటివి జరిగాయి. ఎమ్మెల్యేల ఆదేశాలు, అధికారుల అనుమతితో గ్రామంలోని ఏదో ఒక ఇంటిలోనైనా ఎరువులు నిల్వచేసేవారు. ప్రస్తుతం ఎక్కువ మంది స్థానిక సంస్థల ప్రతినిధులు వైసిపిలో ఉండడం, మొత్తం ఎమ్మెల్యేలంతా టిడిపి జనసేనలో ఉండడం వల్ల ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కొరవడింది. దీంతో, అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగిపోతోంది. ఆ నిర్లక్ష్యమే రైతులపాలిట శాపంగా మారింది. విజయనగరం మండలంలో 14 రైతు సేవా కేంద్రాలు ఉండగా, ఒక్కచోటా కూడా ఎరువుల నిల్వ లేదు. పూసపాటిరేగలో 19 కేంద్రాలకుగాను 3చోట్ల మాత్రమే ఉన్నాయి. డెంకాడ, భోగాపురం మండలాల్లో 4సేవా కేంద్రాల్లో నిల్వలు ఉంచారు. దత్తిరాజేరులో 17కేంద్రాలకుగాను 7కేంద్రాల్లో మాత్రమే ఎరువులు ఉన్నాయి. ఇలా ఒక్క మండలంలో కూడా పూర్తిస్థాయిలో నిల్వలు లేవు. చీపురుపల్లిలో 14కేంద్రాలకుగాను 10కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నప్పటికీ అది యూరియా మాత్రమే, డిఎపి ఇతర కాంప్లెక్స్ ఎరువులు లేవు. ఇదే అదునుగా ప్రైవేటు వ్యాపారులు ధరలు పెంచి విక్రయిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం యూరియా బస్తా రూ.266, డిఎపి రూ.1350 చొప్పున ధర ఉంది. ప్రైవేటు దుకాణాల్లో యూరియా రూ.350, డిఎపి రూ.400 నుంచి రూ.425 వరకు విక్రయిస్తున్నారు. పొటాష్, సూపర్ ఫాస్ఫేట్, ఇతర కాంప్లెక్స్ ఎరువుల్లో ఇదే దోపిడీ జరుగుతోంది. జిల్లాలో నీటి వసతి ఉన్నచోట ఇప్పుడిప్పుడే ఉబాలు ప్రారంభమౌతున్నాయి. ఆగస్టు నుంచి నాట్లు ఊపందుకోన్నాయి. అప్పటికీ ఇదే పరిస్థితి కొనసాగితే రైతులు తీవ్ర అవస్థలు పడడంతో ఆర్థిక దోపిడీకి గురికావాల్సివస్తుంది. ప్రభుత్వం అన్ని గ్రామాల్లోనూ గోడౌన్ల సదుపాయాన్ని కల్పించాల్సి వుంది.

'ఎరువు ఎక్కడా దొరకడం లేదు'

జామి : ఎరువులు ఎక్కడా దొరక్క రైతులు పడిగాపులు కాస్తున్నారని మాజీ జెడ్‌పిటిసి సభ్యులు బండారు పెదబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావుకు వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలో రైతులు ఉబాలు వేస్తున్నారని, అందుకు డిఎపి, యూరియా లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అందుకు రామారావు స్పందిస్తూ జామి కోఆపరేటివ్ స్టోర్‌కు, జామి-3 సచివాలయానికి, భీమసింగి రైతు సేవా కేంద్రానికి వచ్చే ఆదివారంలోపు ఎరువులు అందిస్తామని హామీ ఇచ్చారు.



లేఅవుట్ గా మార్చేసిన బాబు చెరువు ఇదే

అక్రమ లేఅవుట్‌కి హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలో 7.25 ఎకరాల బాబు చెరువును ఆక్రమించి వేసిన లేఅవుట్‌కు హైకోర్టు స్టేటస్‌కో నోటీసులు జారీ చేసిందని సామాజిక కార్యకర్త హెచ్.సన్యాసి శెట్టి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చెరువు పాత సర్వే నంబరును మార్చి వేర్వేరు సర్వే నంబర్లుగా చేసి కొంతమంది స్థానికులు నాయకులు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై.. దానిని కప్పేసి లేఅవుట్ వేశారని తెలిపారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం స్పందించి స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. లేఅవుట్‌లో ఎటువంటి అభివృద్ధి పనులు గాని, అమ్మకాలు గాని, లావాదేవీలు గానీ చేయకూడదని, ప్రస్తుత స్థితిని కొనసాగించాలని కోర్టు ఆదేశించిందన్నారు. కొంతమంది ఇప్పటికే ఆ లేఅవుట్‌లో రూ.లక్షలు పెట్టి స్థలాలు కొన్నారు. ఈ విషయమై తహాశీల్దార్ కిరణ్ కుమార్‌ని వివరణ కోరగా, లేఅవుట్‌లో ఎటువంటి నిర్మాణాలు, కార్యకలాపాలు చేపట్టకూడదని హైకోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసిన మాట వాస్తవమేనని తెలిపారు. తదుపరి కోర్టు ఆదేశాలు జారీ అయ్యేంతవరకు ఎలాంటి కార్యకలాపాలు జరగకుండా చూస్తామన్నారు.

క్షయనియంత్రణ విభాగంలో పోస్టుల భర్తీకి రీ నోటిఫికేషన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం-మన్యం జిల్లా క్షయ విభాగంలో ఐదు పోస్టులను భర్తీ చేసేందుకు రీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు విజయనగరం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణి వెల్లడించారు. వైద్యాధికారి, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్, డాట్స్ ప్లస్ టిబి-హెచ్ఐవి సూపర్‌వైజర్, పిపిఎం కోఆర్డినేటర్, అకౌంటెంట్ ఉద్యోగాల్లో కాంట్రాక్టు పద్ధతిలో అభ్యర్థుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసే అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ ఏడాది ఆగస్టు 1వ తేదీలోగా విజయనగరంలోని క్షయ నియంత్రణ అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ పోస్టుల భర్తీ కోసం గత ఏడాది సెప్టెంబరులో నోటిఫికేషన్ జారీ చేశారని, సార్వత్రిక ఎన్నికల కారణంగా పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తికాలేదని తెలిపారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తాజాగా నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్టు తెలిపారు. ఆయా పోస్టులకు కావలసిన అర్హతలు, జీతం ఇతర సమాచారం కోసం జిల్లా వెబ్‌సైట్ www.vizianagaram.nic.in పరిశీలించవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు పార్వతీపురం - మన్యం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి కార్యాలయంలో పనిచేయవలసి వుంటుందని పేర్కొన్నారు. ఒక ఏడాది కాలంపాటు పనిచేసేందుకు ఈ నియామకం జరుగుతుందని తెలిపారు.

జాబ్‌మేళాలో 128 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో జిల్లా ఉపాధి కల్పనశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 128మందిని తదుపరి దశకు ఎంపిక చేశారు. కెఎల్‌గ్రూప్ ఎస్‌కె సేఫ్టీవింగ్స్ ప్రయివేట్ లిమిటెడ్ (అమెజాన్) కంపెనీలో వివిధ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు మొత్తం 319 మంది అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ పర్యవేక్షణలో జరిగిన ఈ మేళాలో ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ టివి గిరి, హెచ్‌ఆర్ వి.బాబాజి, యంగ్ ప్రొఫెషనల్ యశ్వంత్ బాబు, ఉపాధి కార్యాలయం, ఐటిఐ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారి అరుణ

జొన్నాడ టోల్‌ప్లాజా ఎత్తేయాలని నిరసన

30న మహాధర్నాకు పిపిఎస్‌ఎస్ పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిత్యం రద్దీగా ఉండే విజయనగరం టు విశాఖ పట్నం జాతీయ రహదారిలో జొన్నాడ వద్ద ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న మహా ధర్నా చేయనున్నట్లు పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకర్రావు తెలిపారు. టోల్‌గేట్‌ను నిరసిస్తూ శుక్రవారం కోట వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టోల్‌గేట్ వల్ల ప్రజలపై కోట్లాది రూపాయలు బారాలు పడుతున్నాయని తెలిపారు. ప్రధానంగా టాటా ఎసి, కారు, బస్ , లారీ , వ్యాన్ , తదితర వాహనాలకు 90 రూపాయలు వసూలు చేస్తున్నారని, పాత రోడ్డుకు టోల్ వేయడం దుర్మార్గమని అన్నారు. ఈ నేపథ్యంలో టోల్‌ప్లాజాను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే ధర్నాకు ప్రజలంతా తరలిరావాలని కోరారు. ఈ విషయమై ఇప్పటికే ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న పిపిఎస్‌ఎస్ నాయకులు, ప్రజలు

28న బీచ్ కబడ్డీ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆగష్టు 2 నుండి 4 వరకు నెల్లూరు జిల్లా లోని ఇందుకూరి పేటలో జరగబోయే 11వ రాష్ట్రస్థాయి సినియర్ బీచ్ కబడ్డీ ఛాంపియన్ షిప్ పాల్గొనే ఉమ్మడి విజయనగరం జిల్లా జట్లు ఎంపిక సారిపల్లి వద్ద ఉన్న దిబ్బేశ్వర దేవాలయం వద్ద 28న ఉదయం 9 గంటలకు ఎంపికలు జరుగుతాయని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు రంగారావుదొర, కెవి ప్రభావతి ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.లక్ష్మణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9949721949 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని ప్రకటన ద్వారా ఆయన కోరారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ప్రభుత్వ పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 15ఏళ్లకనీస సేవ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఈనెల 26నుంచి ఆగస్టు 5లోగా ప్రతిపాదనలను ఎంఇఒలు, డిప్యూటీ డిఇఒల వారి కార్యాలయాలకు అందజేయాలన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో చెస్ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వాసవీ క్లబ్ ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో చెస్ పోటీలు నిర్వహించారు. క్లబ్ జిల్లా గవర్నర్ ఆత్మకూరి సాంబమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయి లో జరిగే ఈ పోటీలలో విజేతలను తిరుచ్చిలో ఆగష్టు 10,11 తేదీలలో జరగబోయే జాతీయస్థాయిలో ఫైనల్ పోటీలకు పంపిస్తామన్నారు.

ఈ పోటీలకు కట్టమూరి భాస్కరావు మూర్తి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చెన్నా బుచ్చి జనార్ధనరావు, కార్యదర్శి కట్టమూరి రత్నారావు, కోశాధికారి విజ్జపు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ ఎంపిడిఒపై 'విజిలెన్స్' విచారణ

ప్రజాశక్తి-రామభద్రపురం

గతంలో ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన రమామణిపై శుక్రవారం ఉపాధిహామీ విజిలెన్స్ అధికారి వెంకటరమణ విచారణ చేపట్టారు. మిర్తివలస గ్రామానికి చెందిన గిరడ షణ్ముఖరావు ఫిర్యాదు మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ విచారణ జరిగింది. సాధారణ ఎన్నికల ముందు ఇక్కడ పనిచేస్తున్న కాలంలో సుమారు రూ.9 లక్షల ప్రభుత్వ సొమ్మును అవినీతి చేశారని, గ్రామాలకు కారులో రాకపోకలకు కేవలం 5 కిలోమీటర్లలోపు ఉన్న దూరాన్ని 100 నుంచి 250 కిలోమీటర్లు తిరిగినట్టు లాక్‌బుక్ లో నమోదుచేసి ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని ఈ ఏడాది జనవరి 12న లోకాయుక్తకు, విజిలెన్స్, పంచాయతీరాజ్ కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. దీనిపై లోకాయుక్త ఆదేశాల మేరకు ఉపాధిహామి విజిలెన్స్ అధికారి, ఎంపిడిఒ చుక్క ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో ఈ విచారణ నిర్వహించారు. దీనిపై ఎంపిడిఒ రమామణి స్పందిస్తూ తాను నిధులు దుర్వినియోగం చేయలేదని, ప్రభుత్వ కార్యక్రమాలకు మాత్రమే ఒకే పంచాయతీకి 5 నుంచి 6 సార్లు వెళ్లానని చెప్పారు. అధికారులకు ఒక కారు చూపించి వేరే కారులో తిరిగి తప్పుడు పత్రాలు సృష్టించి ఆమె ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేశారని ఫిర్యాదుదారు షణ్ముఖరావు నొక్కి వక్కాణించారు. దీనిపై లోతైన విచారణ చేపట్టి, ఆమె నుంచి ప్రభుత్వ ధనాన్ని రికవరీ చేయడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె పనిచేసిన కాలంలో ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వలేదని, సకాలంలో బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేశారని రొంపల్లి ఎంపిటిసి భవిరెడ్డి శంకరరావు విచారణ అధికారి దృష్టికి తెచ్చారు. విచారణ నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని విజిలెన్స్ అధికారి వెంకటరమణ తెలిపారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

భోగాపురం : మండలంలోని చెరుకుపల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ జైసన్ రెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన రెండు రోజులుగా విశాఖలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. జైసన్‌రెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఎపిఒ ఆదిబాబు, యూనియన్ నాయకులు రాజారావు, అచ్యుతరావు, త్రినాథ్ ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

సంతకవిటి : రాజాం పట్టణంలో పాలకొండ వెళ్లే రహదారి అధ్వానంగా తయారైన విషయం తెలిసిందే. దీనిపై ఈ నెల 22న 'ప్రజాశక్తి'లో 'అడుగుకో గొయ్యి.. గజానికో గుంత' కథనం రావడంతో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ స్పందించారు. ఆర్‌అండ్‌బి అధికారులతో మాట్లాడి రాజాం జిఎంఆర్ ఐటి నుండి పాలకొండ జంక్షన్ వరకు భారీ గుంతలను పూడ్చి, మరమ్మతు పనులను ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నివేదికను అందజేశారు. త్వరలో రోడ్డు పనులను ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా తాత్కాలిక మరమ్మతులను ప్రారంభించినట్లు తెలిపారు.



మరమ్మతులు చేపడుతున్న పొక్లెయినర్

బొబ్బిలిలో కుండపోత వర్షం



రోడ్డుపైకి చేరిన నీరు

బొబ్బిలి : ఆకాశానికి ఏమైనా చిల్లు పడిందా? అన్నట్లు బొబ్బిలిలో కుండపోత వర్షం కురిసింది. భారీ వర్షంతో పట్టణం జలమయమైంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 9 గంటల వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో మున్సిపాలిటీలోని గొల్లపల్లి, పాతబొబ్బిలి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాజా కళాశాల నుంచి పూల్‌బాగ్ జంక్షన్ వరకు, పాతబొబ్బిలి రోడ్డు రోడ్లు జలమయం కావడంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపైకి, నివాస ప్రాంతాల్లోకి వరదనీరు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి

మున్సిపాలిటీలోని కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మి.. పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని పూల్‌బాగ్, గొల్లవీధి, యాతవీధి ప్రాంతాలలో శుక్రవారం జోరు వర్షంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. విస్తారంగా వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలను కోరారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. ఆమెతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

గిరిజన గ్రామాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

మెంటాడ : మండలంలో గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ సందర్శన కార్యక్రమంలో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజాసంఘాల నాయకులు రాకోటి రాములు, తామరాపల్లి సోములు, మంగళగిరి అప్పలనరసయ్య, రాకోటి హరికృష్ణవేణి కోరారు. ఆండ్ర, లోతుగెడ్డ, కొండలింగాలవలస, ఆగూరు, జిటిపేట, పిట్టాడ, ఉద్దంగి పంచాయతీల్లో గిరిజన గ్రామాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. గిరిజన గ్రామాలలో తాగునీరు, రోడ్లు, విద్య, వైద్యం, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, భూపట్టాలు తదితర సమస్యలు అనేకం ఉన్నాయని చెప్పారు. మైదాన ప్రాంతాలకే గ్రామ సందర్శన కార్యక్రమాలు పరిమితం కావడం వల్ల గిరిజనుల సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ఇకపై చేపట్టే గ్రామ సందర్శన కార్యక్రమాలు గిరిజన గ్రామాల్లో చేపట్టాలని కోరారు.

తూ.తూ మంత్రంగా గ్రామసభ

శృంగవరపుకోట : పట్టణంలోని సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో పంచాయతీ ఇఒ వి.వి.అనురాధ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభ తూ.తూ మంత్రంగా సాగింది. వార్డు సభ్యులు చిప్పాడ శేషగిరిరావు మాట్లాడుతూ గ్రామసభ నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులకు సమాచారం ఇవ్వలేదన్నారు. నూతనంగా బదిలీపై వచ్చిన ఇఒ అనురాధ స్పందించి, మేజర్ పంచాయతీ పరిధిలో రోడ్లు, కాలువలు, కుళాయిలపై దృష్టిసారించాలని కోరారు. పారిశుధ్య పనులు చేపట్టాలని, శిథిలావస్థకు చేరిన విద్యుత్తు స్తంభాలు తొలగించి, కొత్తవి ఏర్పాటుచేయాలని విజ్ఞప్తిచేశారు. సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కారమయ్యేలా చూస్తారని ఇఒ తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చెల్లయ్య పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యానికి సహకరించాలి

నెల్లిమర్ల : నగర పంచాయతీలో సంపూర్ణ పారిశుధ్యానికి ప్రజలు సహకరించాలని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ కోరారు. శుక్రవారం నగర పంచాయతీ పరిధిలో కీర్తివీధి, చందక వీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీర్తివీధి ప్రాంతంలో కాలువలపై ఉన్న పలకలను తీసేయాలని షాపు యజమానులకు సూచించారు. చెత్తను రోడ్లపై పారవేయకుండా పారిశుధ్య వాహనానికి అందించాలన్నారు. మెయిద జంక్షన్, మెయిన్ రోడ్డు ఏరియాలో ప్రధాన కాలువలో పూడికలను జెసిబి ద్వారా తొలగిస్తారని, ఆ సమయంలో వ్యాపారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమా భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి

బొబ్బిలి : బాల్య వివాహాలు నిర్మూలనకు పనిచేయాలని ఐసిడిఎస్ సిడిపిఒ జాగాన విజయలక్ష్మి.. అంగన్వాడీలకు సూచించారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో శుక్రవారం అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే ముందుగా సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. పిల్లలు, తల్లుల పేర్లు పోషణ ట్రాకర్, బాలసంజీవిని యాప్‌లలో సమానంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు వేడి నీరు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎన్.ప్రభావతి, నిర్మల, శుభలక్ష్మి, కృష్ణవేణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదేశాలు పట్టని ఉద్యోగుల జీతాలు నిలిపేయాలి

విజయనగరం టౌన్ : ప్రభుత్వ ఆదేశాలను తుంగలో తొక్కిన దత్తిరాజేరు మండలం అధికారుల జీతాలు నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మానాపురం సంతకు అనుమతులు లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా ప్రతిరోజూ వేలాది పశువులను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

డ్రైడే పాటిస్తేనే దోమల నివారణ

బొబ్బిలి : డ్రై డే పాటిస్తేనే దోమలను నివారించగలమని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణంలో శుక్రవారం డ్రైడేపై ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు నివారణకు కూలర్లు, రిఫ్రిజిరేటర్లు వెనుక భాగంలో నీరు నిల్వ లేకుండా వారానికి ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేయాలని సూచించారు. రుబ్బురోళ్లు, నీటి కుండీలు, ఖాళీ కొబ్బరి బొండాలు, పాత టైర్లలో నీరు నిల్వ లేకుండా చూడాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

స్వార్థం ఎరుగని దేశభక్తులు సైనికులు

జిల్లా సైనిక సంక్షేమ అధికారి డా.సత్య ప్రసాద్ • ఘనంగా కార్గిల్ విజయ్ దివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట

సైనికులంటే స్వార్థం ఎరుగని దేశభక్తులని, వీర సైనికుల త్యాగాలు మరువలేనివని జిల్లా సైనిక సంక్షేమ అధికారి డాక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు. సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమాన్ని స్థానిక గాజులరేగలో మాజీ సైనికుల కాలనీలో నిర్వహించారు. మాజీ సైనికులతో కలిసి తొలుత కార్గిల్ యుద్ధంలో మరణించిన వీర సైనికులకు నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో కెప్టన్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధం 1999లో జరిగిందని, పాకిస్తాన్ పై భారత సైన్యం గెలుపును జూలై 26న ప్రకటించి ఆ రోజును కార్గిల్ విజయ్ దివాస్ గా ప్రకటించారని తెలిపారు. 17 వేల అడుగుల ఎత్తు లో కొండల పైన జరిగిన ఈ యుద్ధంలో 30వేల మంది సైనికులు పాల్గొన్నారని, 527 మంది వీర మరణం పొందారని తెలిపారు. విజయనగరం జిల్లా నుండి 15 మంది సైనికులు కార్గిల్ యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. జిల్లాలో 3410 మంది మాజీ సైనికులు ఉన్నారని, 20 వేల సైనిక కుటుంబాలు ఉన్నాయని వీరి సంక్షేమానికి ప్రభుత్వం ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా మాజీ సైనికుల సంక్షేమ అధ్యక్షులు ఈశ్వర రావు మాట్లాడుతూ 2009లో 351 మంది మాజీ సైనికులకు గాజుల రేగ లో 15 ఎకరాల కొండ పోరంబోకు స్థలం మంజూరు చేసారని,ఇప్పటి వరకు అది సబ్ డివిజన్ కాలేదని, ఇల్లు కట్టుకుందామని బ్యాంకులకు వెళితే రుణాలు ఇవ్వలేమని చెపుతున్నారని, భూ సమస్య ను పరిష్కరించాలని కోరుతూ సైనికి సంక్షేమ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం కార్గిల్ యుద్ధం లో పాల్గొన్న జిల్లాకు చెందిన 14 మంది సైనికులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట రావు, ఇతర సభ్యులు, డివిజినల్ పిఆర్ఒ జానకమ్మ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను కలిసి పలు సమస్యలపై వినతి ఇచ్చారు.



మాజీ సైనికోద్యోగిని సత్కరిస్తున్న జిల్లా సైనిక సంక్షేమ అధికారి సత్యప్రసాద్

సీతం కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలు

సీతం కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్ వేడుకలు ఎన్‌సిసి విభాగం ఆధ్వర్యంలో జరిగాయి. ముఖ్య అతిథులుగా విచ్చేసిన కవిత బండారి మాట్లాడుతూ ప్రాణత్యాగాలు అర్పించిన వీర సైనికులను స్మరించుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం శశిభూషణ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి వి రామమూర్తి , వైస్ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, కెప్టెన్ సత్యవేణి, లెఫ్ట్‌నెంట్ యమ్.వరలక్ష్మి, ఎస్.ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ యుద్ధవీరులకు ఘన నివాళి

బొబ్బిలి : కార్గిల్ యుద్ద వీరులకు మాజీ సైనిక ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. కార్గిల్ యుద్ధంలో ప్రాణాలను త్యాగం చేసిన వీర జవాన్లకు నివాళులు అర్పించేందుకు శుక్రవారం సాయంత్రం మాజీ సైనిక ఉద్యోగుల సంఘం కార్యాలయం నుంచి శ్రీవేణుగోపాల స్వామి ఆలయం వరకు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. దేశ రక్షణ కోసం ఆర్మీ జవాన్లు ప్రాణాలను త్యాగం చేశారని మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఆర్.కిరణ్ కుమార్, కోశాధికారి వివిఎన్ శర్మ, మాజీ సైనికులు అన్నారు.

సొంత జిల్లాకు తహశీల్దార్లు

విజయనగరం : ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహశీల్దార్లను సొంత జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారికి మండలాలను కేటాయిస్తూ కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మండలం	తహశీల్దార్ పేరు
మెరకముడిదాం	అజురఫీజాన్
బొండపల్లి	రాజేశ్వరరావు
గజపతినగరం	రత్నకుమార్
శృంగవరపుకోట	అరుణకుమారి
సంతకవిటి	కళ్యాణ్ చక్రవర్తి
తెర్లాం	హేమంత్‌కుమార్
గరివిడి	బంగార్రాజు
పూసపాటిరేగ	తాడ్డి గోవింద
దత్తిరాజేరు	విజయభాస్కర్
కొత్తవలస	నీలకంఠారావు
మెంటాడ	కె.శ్రీనివాసరావు
గుర్ల	పి.ఆదిలక్ష్మి
డెంకాడ	పద్మావతి
భోగాపురం	ఎం.సురేష్
విజయనగరం	కూర్మనాథరావు
రేగిడి	ఎల్లారావు
బాడంగి	కె.సుధాకర్
బొబ్బిలి	ఎం.శ్రీను
చీపురుపల్లి	ఎన్.రాజారావు
వంగర	ధర్మరాజు
కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు	
డి-సెక్షన్	టి.రామకృష్ణ
సి-సెక్షన్	శ్రీనివాస్ మిశ్రా
హెచ్-సెక్షన్	ఐ.భాస్కరరావు
కలెక్టరేట్ ఎఒ	బిఎస్‌దేవ్ ప్రసాద్
చీపురుపల్లి ఎడిఒ	ఆర్.ఈశ్వరమ్మ
కెఆర్‌ఆర్‌సి స్పెషల్‌తహశీల్దార్	వి.ఆదిబాబు
విజయనగరం ఎడిఒ	డి.శ్రీనివాసరావు

ఎన్నికల హామీలను అమలు చేయాలి

బొబ్బిలి : ఎన్నికల ముందు టిడిపి కూటమి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముప్పల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే అమలు చేస్తామన్న సూపర్ సిక్స్ పథకాలను ఎక్కడా అమలు చేయడం లేదని చెప్పారు.

యంత్రంతో నాట్లతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-డెంకాడ

యంత్రంతో నాట్లు వేయడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు తెలిపారు. మండలంలోని సింగవరం గ్రామంలో రైతు పిట్టా శ్రీనివాసరావు పొలంలో యంత్రం ద్వారా వరి నాట్లు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో సంప్రదాయ పద్ధతిలో నాట్లు వేస్తే చదరపు మీటరుకు 24 కుదుర్లు ఉంటాయని, యంత్రం ద్వారా నాట్లు వేస్తే 33 కుదుర్లు ఉంటాయని చెప్పారు. దీనివల్ల ఎకరానికి ఆరు నుంచి ఏడు బస్తాలు అధికంగా దిగుబడి పొందవచ్చన్నారు. దోమపోటు ఉధృతి కూడా చాలా వరకు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడి ఎ.నాగభూషణరావు, ఎఒ పి.నిర్మల, ఎఇఒ బి.రామకోటి, గ్రామ నాయకులు పి.అప్పారావు, ఎ.కూర్మారావు, బి.అప్పలస్వామినాయుడు, ఎల్.రమేష్ పాల్గొన్నారు.

రామభద్రపురం : పంట పొలాల్లో పురుగు నాశనానికి వేప కషాయం మెరుగైన ఫలితాలు ఇస్తుందని వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. నాయుడువలసలో రైతు సేవా కేంద్రం వద్ద వేపగింజల కషాయం తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. దీనిని పంట తెగుళ్లు, పురుగులపై పిచికారీ చేసుకోవడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శర్మ, తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ.. రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రామారావు

బాడంగి : మండలంలోని కోటిపల్లి గ్రామంలో వరినారు చిగుర్లు తుంచి నాటడంపై మండల వ్యవసాయ అధికారి శిరీష రైతులకు అవగాహన కల్పించారు. దీనివల్ల వరిలో వచ్చే పీకపురుగు అవశేషాలు, గుడ్లు ఆకు చివర్లో నుంచి నాశనం చేయడం ద్వారా పురుగు ఉధృతి అదుపులో ఉంచగలమని తెలిపారు. కార్యక్రమంలో విహెచ్ఎ వై.అనూష, రైతులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ

గజపతినగరం : మండలంలోని కొణిశ గ్రామంలో భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యంపై వ్యవసాయ శాఖ ఎడి మహారాజన్ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. గాజులరేగ వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్తలు ఎం.వి.వి శ్రీనివాసరావు, త్రివేణి, జిల్లా శిక్షణ కేంద్రం నుంచి గోవిందమ్మ హాజరై భూసార పరీక్ష పద్ధతి, వాటి లాభాలు, పోషకాలు గురించి వివరించారు. పచ్చిరొట్ట ఎరువులు పెంచి పొలంలో సేంద్రీయ కార్బన్ శాతం పెంచాలని కోరారు. ఎద పద్ధతి వరిని పండించే రైతులు తప్పక కలుపు యాజమాన్యం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎఒ ధనలక్ష్మి, విఎఎ భార్గవి, గ్రామ నాయకులు రామ్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన



గజపతినగరం.. విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని జిన్నాం గ్రామంలోని ఉన్నత పాఠశాలను శుక్రవారం డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ సందర్శించారు. సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా మొబైల్ ఫోన్ల వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులు ప్రదర్శించిన నాటకాన్ని వీక్షించారు. ఐఎఫ్ ప్యానెల్‌లో వివిధ రకాల ఫీచర్లను విద్యార్థులు ఉపయోగించే విధానాన్ని తిలకించి వారిని అభినందించారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. పబ్లిక్ పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలో సూచనలు చేశారు. వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలను సంధించి, విద్యార్థులు సమాధానాలు చెప్పడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులతో సమావేశమై ప్రతి విద్యార్థికీ అన్ని సబ్జెక్టుల్లో ప్రాథమిక అంశాలు తప్పకుండా రావాలని, దాని కోసం దృష్టిసారించాలని సూచించారు. మధ్యాహ్న భోజన రిజిస్టర్లను, వండుతున్న వంటలను పరిశీలించి సంతృప్తి చెందారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సిద్ధాంత త్రినాథరావు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో పాల్ ల్యాబ్, గ్రంథాలయాన్ని పరిశీలించారు. అనంతరం ఇంటర్మీడియట్ విద్యార్థులను విద్యా బోధనపై అడిగి తెలుసుకున్నారు. క్రీడా మైదానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.ఉమామహేశ్వరరావు, పిఎంసి చైర్మన్ టి.రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు పొట్నూరు శ్రీరాములు, ఎల్.కృష్ణ, జిల్లా ఎకనామిక్ కోఆర్డినేటర్ తమ్మినేని రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో పాటూరు, సోంపురం గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, పి.బాల భాస్కరరావు పరిశీలించారు. ఐఎఫ్‌పి ప్యానళ్లు, కంప్యూటర్లు, డిజిటల్ పరికరాలు, ట్యాబులు, పాఠశాలల రికార్డులు, మరుగుదొడ్లు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి వారు భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు, సిఆర్‌పిలు కోటేశ్వరరావు, రాంప్రసాద్ పాల్గొన్నారు.



వేపాడ.. రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఒ భాస్కరరావు

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ



విచారణ చేపడుతున్న ఎపిడి అరుణశ్రీ

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని గుర్ల తమ్మిరాజుపేట ఫీల్డ్ అసిస్టెంట్ పలు అవకతవకలకు పాల్పడ్డారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం డ్వామా ఎపిడి అరుణశ్రీ విచారణ చేపట్టారు. ఉపాధిహామి జెఇ దుర్గాప్రసాద్, ఎపిఒ చిన్నప్పయ్య, ఇఒపిఆర్‌డి విమల కుమారి, టెక్నికల్ అసిస్టెంట్ మణికంఠ, తదితరులతో కలిసి గ్రామంలోని సచివాలయం వద్ద గ్రామస్తులను విచారించారు. ఫీల్డ్ అసిస్టెంట్ సరస్వతి కృష్ణపాత్రుని చెరువులో పని చేయకుండానే రూ.9.70 లక్షలు డ్రా చేశారని, వెంకటస్వామి నాయుడు చెరువులో రెండు రోజులు పనులు చేయించి ఒక రోజుకే వేతనం జమ చేశారని, పణుకు బిరసయ్య తోటలో పనిచేయకుండానే నిధులు డ్రా చేశారని తదితర ఆరోపణలపై విచారణ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ సరస్వతి ఒక చెరువు ఆన్‌లైన్‌లో చూపించి, వేరే చెరువు వద్ద ఉపాధి పనులు చేయడం తప్పేనని అంగీకరించారు. ఫీల్డ్‌అసిస్టెంట్ గ్రామానికి చెందిన వ్యక్తి కాదని, వేరే ఊరు వివాహం చేసుకొని వెళ్లి కేవలం ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్ కోసం సరిపడా హాజరు నమోదు చేసినట్టు గ్రామస్తులు.. ఎపిడికి వివరించారు. గత ప్రభుత్వంలో ఉన్న ఎంపిడిఒ, మిగతా అధికారులు ఈ ఫీల్డ్ అసిస్టెంట్ పల్లి సరస్వతిని నియమించారని తెలిపారు. ఏనాడూ గ్రామసభ ఏర్పాటుచేయలేదని చెప్పారు. వైసిపి నాయకులకు అనుకూలంగా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ఎపిడి మాట్లాడుతూ ఆరోపణలు నిర్ధారణ అయితే ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

ప్రజాశక్తి-బాడంగి

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం చేశారని సిపిఎం నాయకులు ఎ.సురేష్ తెలిపారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం బాడంగి మండలం రామచంద్రపురంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించినట్లు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ప్రపంచ బ్యాంకు దగ్గర అమరావతి నిర్మాణానికి అప్పు చేసేందుకు బడ్జెట్‌లో అనుమతి ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికులు, రైతులకు తీవ్ర అన్యాయం చేశారని, అన్ని రంగాలకు ప్రాధాన్యత తగ్గించారని చెప్పారు. కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రజలు తీవ్రంగా ఖండించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి, అమరావతి నిర్మాణానికి, విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్కీమ్‌వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, స్కీమ్‌వర్కర్లు

కేంద్ర బడ్జెట్‌లో దళిత, ఆదివాసీలకు మొండిచేయి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రబడ్జెట్‌లో దళిత ఆదివాసీలకు మొండిచేయి చూపారని డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు అన్నారు. నేషనల్ క్యాంపెయిన్ దళిత హ్యూమన్ రైట్స్, దళిత బహుజన శ్రామిక యూనియన్ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌లో ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు కేటాయింపులపై విశ్లేషణ నివేదికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ బడ్జెట్ లో సమానత్వం సాధన దిశగా,పేదరిక నిర్మూలనకు నిర్దిష్టమైన చర్యలు లేవని తెలిపారు. ఎస్సీ జనాభా నిష్పత్తి ప్రకారం 2,14,109 కోట్లు ఇవ్వాల్సి వుండగా 165493 కోట్లు, మాత్రమే కేటాయించారన్నారు. ఎస్టీలకు 1,24,909 కోట్లు కేటాయించి అందులో 41730 కోట్లు మాత్రమే ప్రత్యక్షంగా ఉపయోగపడే పథకాలకు కేటాయించారన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల ఆర్థిక అభివృద్ధి కోసం సవరణల బడ్జెట్లో మార్పులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిబిఎస్‌యు రాష్ట్ర నాయకులు బంగార్రాజు, దళిత ఐక్యవేదిక కన్వీనర్ రవికుమార్, ప్రజ్వల సంఘం ప్రతినిధి కొమ్ము నవీన్ కుమార్ పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నైపుణ్యాభివృద్ధిలో భాగంగా రెడ్ క్రాస్ వాలంటీర్లకు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమం శుక్రవారం ఉదయం రెడ్ క్రాస్ యోగా కేంద్రంలో నిర్వహించారు. విశాఖ హెచ్‌పిసిఎల్ రిటైర్డ్ చీఫ్ సూపరింటెండెంట్, మనస్తత్వవేత్త కె.వెంకటరావు వ్యక్తి వైఖరి , హావభావాలు, అహంకారం, ద్వేషం నిరోధించడం తదితర విషయాలపై వివరించారు. వాటిని మెడిటేషన్ ద్వారా ఎలా సత్ఫలితాలు పొందవచ్చో తెలిపారు. అనంతరం పట్టణ నిర్వాసితుల కేంద్ర నిర్వహణకు లక్ష రూపాయలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్ రావు, కార్యదర్శి కె.సత్యం, ట్రెజరర్ టి.రామారావు, వెంకటరావును సత్కరించారు.

31న పిడిఎస్‌ఒ ధర్నా

విజయనగరం టౌన్ : విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి ఈనెల 31న అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని పిడిఎస్‌ఒ జిల్లా కార్యదర్శి బి.రాకేష్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎపిటిఎఫ్ భవనంలో ధర్నా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు.

నేరాలు ఘోరాలు

వ్యాను బోల్తా .. ఒకరు మృతి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని మరడాం సమీపంలో శుక్రవారం ఓ వ్యాన్ బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. విశాఖపట్నం జిల్లా మారికవలస ప్రాంతానికి చెందిన వ్యానులో సామాగ్రిని సాలూరులో అన్‌లోడ్ చేసుకుని తిరిగి వస్తుండగా మరడాం సమీపంలో అదుపుతప్పి వ్యాను బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ లొడగల పైడి నాయుడు(35) అక్కడికక్కడే మృతి చెందగా శివకుమార్(38) తీవ్ర గాయాలు పాలయ్యాడు. తీవ్రంగా గాయపడిన శివకుమార్‌ను ఆస్పత్రికి తరలించారు. తేలికపాటి వర్షం పడడంతో పాటు అతివేగంగా వ్యాన్ వెళ్లడం వల్ల ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. టి. బూర్జి వలస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు .

పోక్సో కేసుపై డిఎస్‌పి విచారణ

భోగాపురం : పోక్సో కేసుపై విజయనగరం డిఎస్‌పి ఆర్.గోవిందరావు శుక్రవారం మండలంలోని ముంజేరులో విచారణ చేశారు. గ్రామానికి చెందిన బాలికను రాయపురెడ్డి సురేష్ అపహరించి తీసుకుపోవడంతో కిడ్నాప్‌తోపాటు పోక్సో కేసు గురువారం నమోదు చేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా డిఎస్‌పి శుక్రవారం యువకుడి ఇంటి వద్ద, చుట్టుపక్కల విచారణ చేశారు. సిఐ రవికుమార్, ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన టోల్‌గేట్ ఉద్యోగి మృతి

భోగాపురం : మండలంలోని జాతీయ రహదారిపై ఆటోని ఢీకొని తీవ్ర గాయాలపాలైన టోల్‌గేట్ ఉద్యోగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. డెంకాడ మండలం మోదవలసకు చెందిన మంతెన పైడిశెట్టి (36) నాతవలస టోల్‌గేట్‌లో పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం బైక్‌పై విధులకు వెళ్తూ టోల్ గేట్ సమీపంలో సుందరపేట వంతెనపై ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టాడు. ఆయనకు తీవ్ర గాయాలవడంతో విజయనగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పేదవాడు కావడంతో ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, కనకల రామారావు తదితరులు ఆర్థిక సహాయం అందించారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని మిగతా సిబ్బంది టోల్ గేట్ యాజమాన్యాన్ని కోరడంతో నాలుగు లక్షల ఆర్థిక సహాయం అందించారు. తోటి సిబ్బంది మరో రెండు లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించారు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ, ఎ.రావివలస సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి, టోల్ గెట్ యూనియన్ ప్రెసిడెంట్ చింతపల్లి శ్రీనివాసరావు, మాజీ ప్రెసిడెంట్ కర్రోతు శంకరరావు.. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

వ్యక్తి అదృశ్యం

జామి : జామి గ్రామంలోని బిసి కాలనీకి చెందిన కొలుపూరి ప్రకాశ్ (60) కనిపించడం లేదని కుమార్తె శ్రావణి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. ఈ నెల 24న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రానట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.